


# మనిషిలో మనిషి

'రసరాజు'

శ్రీపతి ఆ రోజు కఠోర నిర్ణయం తీసికొన్నాడు.

అసలా ఉద్దేశం ఎన్నో రోజుల నుంచి అతని మనసులో రెక్క తొడుగుతూనే ఉంది.

దానికి తగ్గట్టు — ఈ మధ్య రాజ్యలక్ష్మి పోరుకూడ మరీ ఎక్కువయిపోయింది.

రేణిగుంటలో ఉన్నప్పుడు తనకీబాధ తెలిసింది కాదు.

అడపాదడపా ఆ సంపర్కం ఎదురైనా— ఎప్పుడూ ఇంత విరక్తి, విసుగు జనించలేదు.

తిరుపతి వచ్చిన వేళా విశేషం ఏమిటోగాని తిట్టుకోని రోజు లేదు— తీరుబడిగా కూర్చున్న సమయంలేదు.

పుట్టగొడుగుల్లా పూట పూటకీ చుట్టాలే!

దేవుణ్ణి చూడ్డానికి వచ్చామని కొందరు ...

వేరేదో పని మీద వచ్చామని ఇంకొందరు...

ఇలా ప్రతి పూటా ఎవరో ఒకరు అర్ధరాత్రీ అపరాత్రీ అనకుండా ఇంటికొచ్చి బాధించడం మామూలయిపోయింది.

రాజ్యలక్ష్మి కూడా శుద్ధ మొహమాటస్తురాలు.

మనసులో ఏం తిట్టుకున్నా, మర్యాదకి లోటు రానిచ్చేది కాదు. ఏదో ఇంత వండి పడేసి ఆ తర్వాత మూలుక్కునేది.

శ్రీపతీ అంతే!

ఎవరెక్కడ చిన్నబుచ్చుకుని బాధపడతారోనని ఎప్పుడూ ఏ మాటా ముఖమెదురుగా అనేవాడు కాదు.

అసలు అదెంతవరకు సమంజసం అని ఆలోచించేవాళ్ళు ఒక్కళ్ళు కూడ లేరనేదే అతని బాధ.

పట్నంలో కాపురం ఎన్ని ఇబ్బందులతో కూడుకొని ఉంటుందో కనీసం వాళ్ళు ఆలోచించరు.

పంపునీళ్ళ మొదలుకొని పాలసీసాల వరకు ఎన్ని సమస్యల పాలెగూళ్ళను తప్పించుకొంటూ వెళ్ళాలో వాళ్ళకు పట్టదు. రాబడికీ, ఖర్చుకీ మధ్య రంపపు కోతను అనుభవించే మధ్యతరగతి కుటుంబాల గోడుతో వాళ్ళకు ప్రమేయం లేదు.

అసలీ సమాజం ఎప్పుడు బాగుపడుతుందో ఆ ఏడుకొండల వాడికే తెలియాలి.

శ్రీపతికి చుట్టాలంటేనే చిరాకు పుట్టింది.

చుట్టాన్ని చూస్తే మహాపాపమనిపించింది.

పుణ్యం పురుషార్థం మాటలెలా ఉన్నా, చివరికి పుడిసెడు నీళ్ళు కూడా దక్కవేమో అనిపించింది.

చుట్టాన్ని శత్రువులా చూడాలి...

అందుకే శ్రీపతి ఆ నిర్ణయానికొచ్చాడు.

రాజ్యలక్ష్మి ఒ. కే. అంది.

• • •

ఆ రోజు ఆదివారం.

గడిచిన రెండ్రోజుల్నుంచీ తన నిర్ణయానికి తగ్గట్లు చుట్టం పేరు చెపితే రాలేదు.

రాజ్యలక్ష్మి కొంచెం వూపిరి పీల్చుకొంది.

శ్రీపతి కడుపునిండా భోజనం చేశాడు.

ఆ రోజు బయట గ్రీష్మం నిప్పుల్ని కురుస్తుండటంతో శ్రీపతి తెల్లారిన తర్వాత రోడ్డు ముఖమే చూడలేదు.

కృష్ణ గానం చేసిన 'వేంకటేశ్వర స్వరగిరి మాలిక' రికార్డు వింటూ కిటికీ దగ్గరిగా కూర్చున్నాడు.

ఎదురుగా నల్లటి కొండలు.

ఆ కొండల మధ్యలోంచి మలుపులు తిరుగుతూ పైపైకి సాగిపోయిన ఘాట్ రోడ్డు.

దానిమీద వచ్చీ పోయే వాహనాలు దూరానికి అగ్గిపెట్టెల్లా కనబడుతున్నాయి.

శ్రీపతి తిరుపతి వచ్చినప్పట్నుంచీ ఇదే వరస. ఏ మాత్రం విరామం దొరికినా—కిటికీ దగ్గరగా కూర్చొని ఆ దృశ్యాన్ని చూడటం అతని కో హాబీ అయిపోయింది.

చీకటి రాత్రుల్లో అయితే అతని ఆనందానికి అవధులే కనిపించవు. భువి నుండి దివికి వేసినట్లున్న దీపాల దారిని చూస్తూ సర్వం మర్చిపోయేవాడు. అదే వెన్నెల రోజులైతే కొండలకు క్షీరాభిషేకం జరుగుతున్నట్లుగా మురిసిపోయేవాడు.

గొంతు తడి ఆరటంతో కూజాలో నీళ్ళు గొంతుకలో పోసికొని వాచీకేసి చూశాడు.

ఏడు గంటలు —

రాజ్యలక్ష్మి వంట గదిలో కూర్చుని కూరలు తరుగుతోంది.

బయటి నుండి ఎవరో పిలిచినట్లు వినిపించింది.

రాజ్యలక్ష్మి ఉలిక్కిపడి చూసింది వీధిలోకి.

శ్రీపతి మంచం మీద నుండి లేః

డీలక్స్ వారి నవంబర్ 5 విడుదలలు
ముచ్చటగొలిపే బాపు ముఖ చిత్రాలతో...
(ఆంధ్రుల ప్రియతమ రచయిత్రి)
మాదిరెడ్డి సులోచన
నవలామాల...
ఏ పత్రికలోనూ సీరియల్‌గా కాక
డైరెక్ట్‌గా వెలువడుతున్న నవల-
• ఎంత ఘాటు ప్రేమయో-
వెల: 12.50
నవంబర్ 5 లోపు ఆర్డరు పెట్టువారికి
రూ.11లకే సప్లయి చేయబడును
మరియు... పాఠకుల ప్రశంసలు పొందిన
• బిందు పథం రూ.12.50
• రవిచంద్ర రూ.10.00
• శ్రీమంతులు రూ.10.00
• ఎదగని మనసులు రూ.10.00
• సుషుప్తి రూ.10.00
ముందుగా మీ దగ్గరలోని బుక్ షాపుల్లో గాని, న్యూస్ ఏజెంటు దగ్గరగాని అడగండి. లేదా- మీకు కావలసిన పుస్తకం వెలలో 1 రూపాయి తగ్గించి M.O.-చేయండి
పోస్టు ఖర్చులు మేమే భరించి ఆ రూపాయికి V.P.P లో పంపుతాము!
డీలక్స్ పబ్లికేషన్స్
ఏలూరు రోడ్. విజయవాడ-520002

వీధి గుమ్మంలో కొచ్చాడు. ఎదురుగా వరదరాజులు.

వరదరాజుల్ని చూడగానే శ్రీపతికి ఒళ్ళు మండింది.

వరదరాజులు ఇలా ఇంటికి రావడం -ఇదే మొదటిసారి కాదు.

ఈ మధ్యకాలంలో ఇది మూడవసారి.

మొదటిసారి వచ్చినప్పుడు నిజానికి వరదరాజు లెవరో శ్రీపతికి తెలీదు.

తనే చెప్పుకున్నాడు— బీరకాయ పీచులాంటి బంధువునని.

శ్రీపతి కూడ ఆలోచించాడు— అటు ఏడు తరాలూ — ఇటు ఏడు తరాలు.

దూరపు బంధుత్వం ఎక్కడో మిణుకు మిణుకుమంది. సరేనుకొన్నాడు.

ఆ మొగమాటం వదరదరాజుల్ని మరోసారి రప్పించడానికి కారణ మయింది.

అప్పుడు కూడా శ్రీపతి ఏమీ అనలేదు.

అలా ఏమీ అనక పోవడమే అతనిలో ఉన్న గొప్ప వీక్నెస్.

అందుకే వరదరాజు మళ్ళీ ప్రత్యక్ష మయ్యాడు. ఈసారి దీనంగా, నీరసంగా ఉంది అతని ముఖం.

"ఒక గ్లాసెడు మంచినీళ్ళియ్, తల్లీ!" వరదరాజులు ఆయాసపడుతూ అడిగాడు.

రాజ్యలక్ష్మి కూజాలో నీళ్ళు గ్లాసులో పోసి అతని చేతి కందించింది.

వరదరాజులు కొంచెం ఉపశమించి అక్కడున్న కుర్చీలో కూలబడిపోయాడు.

శ్రీపతి తనంతట తాను ఏమీ మాట్లాడలేదు.

రాజ్యలక్ష్మి కూడ అంతే! ముభావంగా ఉంది.

ఎంతసేపని తను కల్పించుకొని మాట్లాడటం?

వరదరాజులికి దిక్కు తోచింది కాదు.

"చూడమ్మా! నేను భోంచేసే వచ్చాను. నాకోసం చూడకండి." వరదరాజులు చెప్పవలసింది చెప్పాడు.

శ్రీపతి బదులు పలకలేదు.

రాజ్యలక్ష్మి మాత్రం లాంచనంగా అదేమిటి?" అంది.

"రాత్రి పూట భోజనం పెందరాలే చేస్తాను, తల్లీ! ... ఏమీ అనుకోవద్దు. ఒక మడతమంచం ఇస్తే చాలు, బయట పడుకొంటాను ..."

రాజ్యలక్ష్మి కాస్త మొహమాట పడింది.

శ్రీపతి అది గమనించి ఆమెకు కనుసైగ చేశాడు.

రాజ్యలక్ష్మి మారు మాటాడకుండా బయట మడత మంచం వాల్చి వచ్చింది.

శ్రీపతికి వైకుంఠ పాళిలో నిచ్చెన ఎక్కినంత ఆనందంగా ఉంది.

తన నిర్ణయం చెక్కు చెదరకుండా నిలబడుతున్నందుకు తనను తాను అభినందించుకొన్నాడు.

ఇదే దీక్ష కొనసాగితే చుట్టాల సుడిగుండాలు తమను చుట్టుముట్టడం కల్ల.

రాజ్యలక్ష్మి విషయమే ఆలోచించాలి. ఆమె కింకా మొహమాటం పోలేదు.

ఎంతైనా ఆడది! ఆర్ద్రత, కరుణ, ప్రేమ — ఇవన్నీ ఆడదానికి పర్యాయ పదాలు.

ఆమెనొకర్తెనూ కాస్త చూసుకొంటే చాలు. తన నిర్ణయానికి ఢోకా ఉండదు.

శ్రీపతి వీధితలుపు దగ్గరిగా వేసి వంటగదిలో కొచ్చి కూర్చున్నాడు.

రాజ్యలక్ష్మి భోజనం వడ్డించింది.

• • •

"అమ్మాయ్ ..."

రాజ్యలక్ష్మికి మెలకువ రాలేదు.

శ్రీపతికిమాత్రం ఎవరో సన్నగా పిలుస్తున్నట్లు వినిపించింది.

రాజ్యలక్ష్మికి నిద్రాభంగం కలగకుండా పక్కమీద నుండి లేచాడు శ్రీపతి.

లైటేసి గడియారం కేసి చూశాడు.

పదకొండు —

ఇంతరాత్రి వేళ — మళ్ళీ ఏ చుట్టం తగలడ్డాడోనని సందేహిస్తూ తలుపు తీశాడు.

అతనే —

"బాబూ... కాసిని మంచినీళ్ళిద్దూ!"

వరదరాజుల్ని చూసేసరికి శ్రీపతికి అరికాలి మంట నెత్తికొచ్చింది. అయినా తమాయించుకొని గ్లాసుతో నీళ్ళు తీసికొచ్చాడు.

వరదరాజులికి ఆ నీళ్ళు అమృతంలా కనిపించాయి.

"ఇక తలుపేసుకో, బాబూ!" వరదరాజులు మంచినీళ్ళు తాగి మళ్ళీ మంచం మీద వాలిపోయాడు.

శ్రీపతి తలుపుకి గడియ పెట్టి, లైటు ఆర్పేశాడు.


రాజ్యలక్ష్మి మత్తుగా నిద్రపోతోంది.

ఆమె పక్కనే తనూ నడుంవాల్చాడు.

ఎంతసేపటికీ శ్రీపతికి నిద్రరావడం లేదు.

పన్నెండయింది —

పక్కమీద నుంచి లేచి — కిటికీ తెరిచి, దగ్గిరిగా కుర్చీ వేసుకొని కూర్చు




న్నాడు.

కిటికీ వూచల్లోంచి వరదరాజు జైల్లో కైదీలా కనిపించాడు.

మంచం మీద అటూ ఇటూ దొర్లుతూ, మధ్య మధ్య లేచి కూర్చుంటున్నాడు.

అతనికి కలిగిన అసౌకర్యం ఏమిటో శ్రీపతికి అర్థం కాలేదు.

వరదరాజులు మంచం మీద నుండి లేచి వీధిలో ఉన్న కుళాయి దగ్గరికి నడవటం కనిపించింది.

కుళాయి అటూ ఇటూ తిప్పేడు.

నీళ్ళు రాలేదు.

నిరాశగ మళ్ళీ మంచ మీదకొచ్చి పడుకొన్నాడు.

శ్రీపతికి అతని బాధ రేఖామాత్రంగా అర్థమయింది.

వరదరాజులు ఎక్కడో భోంచేసి వచ్చానని చెప్పాడే! ...

అదంతా పచ్చి అబద్ధం ...

ఎక్కడా భోంచేసి ఉండడు!

కాలే కడుపును చేత్తో పట్టుకుని తనింటికే వచ్చాడు.

పరిస్థితి అనుకూలంగా లేదని తెలిసింది.

అనాదరణ ఎదురయింది.

నోరు తెరిచి అడగటం సభ్యత కాదనిపించింది.

ఆకలి అని చెప్పుకోడానికి అభిమానం అడ్డొచ్చింది.

ఎంతయినా బతికి చెడ్డవాడు!

అతని దైన్యం, అసమర్థత, ఆ నిమిషంలో అతన్ని ఎంతగా వెక్కిరించాయో పాపం!

తనుమాత్రం కడుపునిండా తిన్నాడు.

ఆకలిబాధ తనకు తెలీదు.

గుప్పెడు మెతుకుల కోసం తను వెనుకాడడు.

అతిథికి అన్యాయం చేశాడు.

నో నో ... న్యాయమే జరిగింది. కాకపోతే వచ్చిన అతిథికల్లా లేదనకుండా పీక వరకు పెట్టడానికి ఇదేమైనా ధర్మ సత్రమా? తన భవిష్యత్తు తను చూసుకోవద్దూ!

శ్రీపతి అలా ద్వంద్వంగా బాధపడుతూనే కుర్చీలో నిద్రపోయాడు.

రెండు గంటలకు మెలుకువ వచ్చింది.

బయటికి చూశాడు.

వెన్నెల విరగబడి నవ్వుతోంది— పరిహసిస్తున్నట్లుగా.

రోడ్డుమీద యాత్రికుల సందడి ఎక్కువగానే ఉంది.

దృష్టి — అరుగు మీదకు మళ్ళింది.

వరదరాజులు మంచం మీదకూర్చొని అటూ ఇటూ చూస్తున్నాడు.

పాపం! అతని చుట్టూ ఆకలి ... మంటల్లు ...

ఏభయ్యో పడిలో ఉన్న వరదరాజులకీ, తన తండ్రికీ భేదం ఏవిటి?... లేదు! ... వరదరాజులు కూడ తన తండ్రిలాటివాడే.... అదే తన తండ్రి అయితే ఇలా వూరుకునేవాడా?... ఛ ఛ... సాటి మనిషిని ఆదరించని సమాజంలో తనూ ఒకడా!... చస్తే కాకూడదూ!

మహాత్ముడు పుట్టిన దేశంలో మంచితనం, మనిషితనం మరణిస్తే ఎలా?...

మనిషి—మనీషి కావాలి!

మనస్సు—మహస్సు కావాలి!

తపన—తపస్సు కావాలి!

అప్పుడే దేశం సస్యశ్యామలంగా బతుకుతుంది. శ్రీపతి మనస్సులో మానవత్వం తిరగబడింది... వరదరాజులు తెల్లవారేవరకు అలా ఆకలితో అలమటించకూడదు!

తన నిర్ణయం లౌకికమైనది. అది నీళ్ళు కారిపోయినా తన క్షేమే!

నైతికంగా తను నిలబడటం కావాలి!

శ్రీపతి బయటి కొచ్చాడు.

వరదరాజులు మంచంమీద నుండి లేచాడు.

"ఏం బాబూ! నిద్ర పట్టడం లేదా?..."

"మీరూ నిద్ర పోలేదే..."

"ఏముంది, బాబూ! కొత్త చోటు గదా... అలాగే ఉంటుంది. పైగా ఈ వయస్సులో నిద్ర రావడమంటే కొంచెం కష్టమే!..."

"రండి... అలా వెళ్ళి ఏ టీనీళ్ళో తాగొద్దాం..." వరదరాజులు లేచాడు నీరసంగా.

వరదరాజులు కడుపులో ఆకలి అగ్గి నూరుతోంది. ఇద్దరూ కొంత దూరం నడిచి ఒక టీ బడ్డీ దగ్గర ఆగారు. అప్పుడే తీసిన వేడి ఇడ్లీ చూడగానే వరదరాజులికి సగం ఆకలి తీరినట్లయింది.

"ఇడ్లీ తినండి..." శ్రీపతి వరదరాజులికి ప్లేటు అందించాడు. వరదరాజులు దాన్ని మహాప్రసాదంగా స్వీకరించాడు. ఇడ్లీ కడుపులో పడగానే వరదరాజులికి ఏదో కొత్త శక్తి ఆవరించినట్లయింది.

వరదరాజులికి మరో రెండు ఇడ్లీ తినాలనిపించింది. ఆకలితో అతని కడుపు అగ్నిగోళంగా ఉంది.

"టీ తరవాత తీసికోవచ్చు. మరో ప్లేటు తినండి..."

వరదరాజులు మాట్లాడలేదు. ఈ సమయంలో ఇంతకంటె ఆకలి తీర్చే మార్గం మరొకటి కన్పించలేదు శ్రీపతికి.

ఇలా అరడజను ఇడ్లీలవరకు బలవంతంగా తినిపించాడు శ్రీపతి.

వరదరాజులికి ఆకలి తీరితే తనకు ఆనందం! తృప్తి! మానవతా ధర్మం అతన్ని కదిపి కుదిపింది....

వరదరాజులు, శ్రీపతి డ్రాప్ టీ చప్పరించారు. ఆకలి తీరిన వరదరాజులు ఒక సారి తృప్తిగా తేన్చి చుట్ట వెలిగించాడు.

ఇద్దరూ తిరిగి ఇంటి ముఖం పట్టారు. వరదరాజులు ఇప్పుడు నీరసంగా నడవటం లేదు. అతను వేసే ప్రతి అడుగులోనూ ఉత్సాహం ఉట్టిపడుతోంది.

శ్రీపతి మనసులో ఇప్పుడు బాధ లేదు. అతనిలో ప్రత్యణువూ అనిర్వచనీయమైన ఆనందంతో పొంగిపోతోంది.

మనిషిలో మనీషి తృప్తిగా గాలి పీల్చుకొన్నాడు. ★